క్లుప్తంగా

'స్పందన'కు 22 అర్జీలు



అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 22 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఆనంద్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డీటీ, ఆర్‌ఐ, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేటలో 'సురక్ష' సర్వే



సర్వేలో పాల్గొన్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, ఏపీడీవో దుర్గాప్రసాద్

సీతంపేట: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం 25వ వార్డు సీతంపేటలో ఇంటింటా సర్వే నిర్వహించారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో సచివాలయ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి సురక్ష కార్యక్రమంలో అందిస్తున్న 11 రకాల సర్టిఫికెట్ల గురించి వివరించారు. సేవలు అవసరమైన వారి వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏపీడీవో దుర్గాప్రసాద్, సారిపిల్లి సంతోష్, వియ్యపు సంతోష్, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రూ.18 లక్షలతో అభివృద్ధి పనులు



25వ వార్డులో పనులు ప్రారంభిస్తున్న కె.కె.రాజు, గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట మెయిన్ రోడ్‌లోని ఆంజనేయ స్వామి గుడి వద్ద రూ.18 లక్షలతో సీసీ డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణం చేపట్టనున్నారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్‌తో కలిసి సోమవారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ శ్రీరామమూర్తి, స్థానిక నాయకులు సానబోయిన సురేష్, భోగవిల్లి గోవింద్, హరికృష్ణ, సారిపిల్లి సంతోష్, వెంకటేష్, పద్మ, వియ్యపు సంతోష్, శ్రీను, అశోక్, సన్ని, నాగు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బుల్లయ్య కాలేజీలో ముగిసిన వర్క్‌షాప్

సీతంపేట: బోధనలో నాణ్యత మెరుగుపర్చుకోవడానికి లంకపల్లి బుల్లయ్య కాలేజీలో 'ఫలితాల ఆధారిత విద్యాభ్యాసం, పరిశోధన' అనే అంశంపై నిర్వహించిన ఐదు రోజుల వర్క్‌షాప్ సోమవారంతో ముగిసింది. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ నైపుణ్యాల మెరుగుకు ఇటువంటి వర్క్‌షాపులు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ దీపక్ చౌదరి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.శ్రీకాంత్, కన్వీనర్ జె.బాబు, కళాశాల విభాగాధిపతులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధి, 11 కేవీ గురుద్వారా ఫీడర్ పరిధిలో మరమ్మతులు, చెట్టు కొమ్మల ట్రిమ్మింగ్ నిమిత్తం మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్-1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గురుద్వారా, టీపీటీ కాలనీ, ఏఎస్సార్ నగర్, క్షత్రియ కల్యాణ మండపం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

అందరి సంక్షేమమే సీఎం ధ్యేయం

- 'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి
- నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు
- 578 ధ్రువపత్రాల అందజేత
- లబ్ధిదారుల మోముల్లో చిరునవ్వు



లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ లీలావతి

తాటిచెట్లపాలెం: అర్హులైన చిట్టచివరి లబ్ధిదారు వరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలను చేరువ చేసి ప్రజల మోముల్లో చిరునవ్వులు చిందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల పరిధి 42వ వార్డు రైల్వే న్యూకాలనీ జీవీఎంసీ, కేఎన్ఎం బాలికల హైస్కూళ్ల ప్రాంగణంలో సోమవారం కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కె.కె.రాజు, జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, అర్బన్ డిప్యూటీ తహసీల్దార్ త్రినాథరావు లబ్ధిదారులకు పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జగనన్న సురక్షలో భాగంగా ఇటీవల వలంటీర్లు ఇంటింటా చేసిన సర్వేలో వివిధ సర్టిఫికెట్ల నిమిత్తం సుమారు 649 వినతులు రాగా.. వాటిలో 578 పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ సేవలు పొందేందుకు ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారని.. నేడు సీఎం వైఎస్ జగన్ పాలనలో ఇంటికే అన్ని సేవలను అందిస్తున్నామని చెప్పారు. లబ్ధిదారులందరూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఇంటికీ వలంటీర్లు, గృహసారథులు వెళ్లి నివాసుల సమస్యలు తెలుసుకుంటూ వారితో మమేకమై ఉండాలన్నారు.

ప్రభుత్వ సేవలు పొందండి: ఎమ్మెల్యే వాసుపల్లి

చంద్రబాబు ప్రభుత్వ హయాంలో పథకాలు ఉన్నా కూడా వాటిని లబ్ధిదారులకు ఏవిధంగా తగ్గించాలో చూసేవారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చివరి లబ్ధిదారు వరకు పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కొనియాడారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న 11 రకాల ధ్రువపత్రాలను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన ప్రతి ఒక్కరూ పొందాలని కోరారు. అద్భుతమైన పాలన సాగిస్తున్న సీఎం జగన్‌కు ప్రజలంతా సంపూర్ణ మద్దతిచ్చి 2024లో మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంతోషంగా జీవిస్తున్నామని వివిధ పథకాల లబ్ధిదారులు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి బాబూరావు, ఏపీడీ పద్మావతి, మాజీ కార్పొరేటర్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బులుసు జగదీష్, రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ ఎ.సూరిబాబు, డైరెక్టర్లు ఎస్.ప్రసాదరావు, మాధవి, మధు, వార్డు సీనియర్ నాయకులు, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కాళ్లరిగేలా తిరిగే పని తప్పింది



గతంలో ఇటువంటి ధ్రువీపత్రాల కోసం ఎమ్మార్వో, ఇతర కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే వాళ్లం. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఎటువంటి ప్రయాస లేకుండా ఒకేసారి కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందుకున్నాను. వలంటీర్ ఇంటికి వచ్చి సేవలందించడం ఆనందంగా ఉంది.

– షేక్ హసీనా బేగం, రైల్వే న్యూకాలనీ

సులువుగా కుల ధ్రువపత్రం పొందాను



గతంలో సర్టిఫికెట్లు పొందాలంటే చాలా రోజులు వేచి చూడటం, కార్యాలయాల చుట్టూ తిరగడం, దళారులను ఆశ్రయించడం జరిగేది. నేడు వలంటీర్లు ఇంటికే వచ్చి అవసరమైన సేవల కోసం దరఖాస్తు చేసి అధికారుల ద్వారా మంజూరు చేయించి మా చేతికే అందిచడం చాలా బాగుంది. వైఎస్సార్‌సీప ప్రభుత్వం హయాంలో కేవలం మూడు రోజుల్లోనే కుల ధ్రువీకరణ పత్రం పొందడం ఆనందంగా ఉంది.

– ఉప్పాడ రాము, రైల్వే న్యూకాలనీ

సీఎం జగన్‌కు ధన్యవాదాలు



ఎవరి వద్దకు తిరగకుండానే క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లు వచ్చాయి. దీనికి కారణమైన సచివాలయ, వలంటీర్ వ్యవస్థను రూపొందించిన సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు. ఇటువంటి సర్టిఫికెట్లు కావాలంటే కనీసం నెల రోజులు పట్టేది. నేడు కేవలం ఒక్క రోజులోనే నాకు అవసరమైన సర్టిఫికెట్లు పొందాను.

– షేక్ ఖలీషా, రైల్వే న్యూకాలనీ

పౌర గ్రంథాలయంలో గురుపూజోత్సవం



పౌర గ్రంథాలయంలో వీణానాదంతో అలరిస్తున్న జోగులాంబ శిష్య బృందం

సీతంపేట: సంగీత విద్వన్మణి మల్లాప్రగడ జోగులాంబ స్మృత్యర్థం కార్తికేయ కళాక్షేత్రం ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత వీణా విద్వాంసురాలు బండి శ్యామలకు గురు సత్కారం చేశారు. జోగులాంబ శిష్యులు నిష్టల కృష్ణవేణి, వి.అరుణ, ఎం.శివాని, వి.సుబ్బలక్ష్మి వీణానాదంతో అలరించారు. త్యాగరాజు రాసిన తిరువత్తియూరు పంచరత్నములను వీణా నాదంతో వినిపించారు.

నేడు అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.

ఘనంగా గురుపాదుక పూజ



సుబ్రహ్మణ్య దీక్షితావధానిని సత్కరిస్తున్న వావిలపల్లి ప్రసాద్, సనపల వరప్రసాద్



వానప్రస్థ వృద్ధాశ్రమంలో శంకరాచార్యుడికి పూజలు చేస్తున్న వృద్ధులు

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో కొలువైన షిర్డీసాయినాథుడికి గురుపౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం 1008 లీటర్ల పాలతో బాబాను అభిషేకించి భక్తులకు నిజపాద దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా అల్లవరంపు సుబ్రహ్మణ్య దీక్షితావధానికి గురుపాదుక పూజ చేశారు. 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, రామాలయం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, సనపల వరప్రసాద్ ఆయనను సత్కరించి షిర్డీసాయి చిత్రపటాన్ని బహూకరించారు.

వానప్రస్థ వృద్ధాశ్రమంలో..

పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో నిర్వాహకుడు రొబ్బి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపౌర్ణమి ఉత్సవాల్లో శంకరాచార్యుడి విగ్రహానికి వృద్ధులు పూలమాలలు వేసి పూజలు చేశారు.

'కాన్సెప్ట్స్ ఆఫ్ సివిల్ సర్వీసెస్' గ్రంథావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కె.సి.రెడ్డి, రచయిత వెంకటరావు తదితరులు

సీతంపేట: డాక్టర్ చెంబూరు వెంకటరావు రచించిన 'కాన్సెప్ట్స్ ఆఫ్ సివిల్ సర్వీసెస్' గ్రంథావిష్కరణ సుహిత సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ ఆంధ్రప్రదేశ్ చాన్సలర్ ఆచార్య కె.సి.రెడ్డి ముఖ్య అతిథిగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ సాధించడం చాలా మందికి ఒక కల అయితే.. అది సఫలం కావడానికి మంచి శిక్షణ అధ్యయనం అవసరమన్నారు. వర్తమాన విషయాలు, వివిధ శాస్త్రాలపై మంచి అవగాహన ఉండేలా రచయిత వెంకటరావు వెలువరించిన పుస్తకం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. సభాధ్యక్షుడు డాక్టర్ యు.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ రాసే వారికి ఉపయోగపడే విలువైన పుస్తకాన్ని రచించిన డాక్టర్ వెంకటరావు అభినందనీయులన్నారు. ఆచార్య ప్రయాగ సుబ్రహ్మణ్యం పుస్తకాన్ని సమీక్షించారు. రచయిత వెంటకరావు మాట్లాడుతూ 40 ఏళ్లకు పైగా అధ్యాపకుడిగా పోటీ పరీక్షల బోధకుడిగా విశేషమైన అనుభవంతో ఈ పుస్తకాన్ని రాసినట్టు తెలిపారు. మానవీయ విజ్ఞాన శాస్త్రాలు, సాహిత్యం మొదలైన అంశాలను పరిచయం చేశానన్నారు.

బౌద్ధాలయంలో పూజలు



పేద మహిళలకు చీరలు అందజేస్తున్న బౌద్ధ కేంద్ర సమాజం సభ్యులు

కంచరపాలెం: స్థానిక అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆధ్వర్యంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధుడికి ప్రత్యేక పూజలు చేశారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరిపారు. కార్యక్రమంలో సిహెచ్.బాబూరావు, రాజు, భీమారావు, సూరిబాబు, రాము, రామచంద్రరావు, పరిమళ, సునీల్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మహిళలకు ఉచిత శిక్షణ

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి మహిళలకు ఆర్టిఫిషియల్ జ్యూవెలరీ తయారీతోపాటు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శేషామణి, ఎస్.పుష్పలత ఒక ప్రకటనలో తెలిపారు. మురళీనగర్‌లో ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు. ఆసక్తి గల మహిళలు 63035 52016 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని వారు కోరారు.

'గిరి' భక్తులతో పోటెత్తిన రహదారులు



మాధవధార మెయిన్ రోడ్డులో గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తజనం



మాధవ స్వామి ఆలయ జలధార వద్ద పుణ్య స్నానమాచరిస్తున్న భక్తులు

మద్దిపాలెం: సింహాచలం గిరిప్రదక్షిణలో భాగంగా సోమవారం ఉదయం జాతీయ రహదారితోపాటు మాధవధార మెయిన్ రోడ్డు భక్తులతో పోటెత్తాయి. రహదారి గుండా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు రక్షణ చర్యలు చేపట్టారు. జీవీఎంసీ అధికారులు సైతం సోమవారం రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం తాగునీరు, మెడికల్ క్యాంప్‌లను అందుబాటులో ఉంచి నిరంతరం పర్యవేక్షించారు.

పులకించిన మాధవ'ధార'

గిరిప్రదక్షిణ చేసుకుంటూ 51వ వార్డు మాధవధారలోని మాధవ స్వామి ఆలయానికి సోమవారం పెద్ద ఎత్తున భక్తులు చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని జలధార వద్ద పవిత్ర స్నానమాచరించారు. గిరిప్రదక్షిణ, గురుపౌర్ణమి పర్వదినాల సందర్భంగా భక్తుల రాకతో జలధార ప్రాంతం పులకించింది. భక్తుల పుణ్యస్నానాల కోసం జీవీఎంసీ అధికారులు అదనపు కుళాయిలు ఏర్పాటు చేశారు.

ఉత్సాహంగా 'గడప గడపకు..'



సంక్షేమ పథకాలపై 42వ వార్డు లబ్ధిదారులతో మాట్లాడుతున్న కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ, కన్నారావు వీధి ప్రాంతాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు 236 సచివాలయం పరిధిలోని పలు గృహాలను ఉత్సాహంగా సందర్శించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్, 236 సచివాలయ అడ్మిన్ శ్రావణి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి అవనాపు విక్రమ్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, డైరెక్టర్లు, రాయుడు శ్రీను, నాగమణి, ఎయిర్‌పోర్ట్ అడ్వయిజరీ కమిటీ మెంబర్ అంబటి శైలేష్, పార్టీ వార్డు నాయకులు వై.శ్రీనివాసరెడ్డి, బి.గోవింద్, కె.చిన్నా, మహదాస్యం గోపి, వెంకటేష్, సంతోష్, జీవీఎంసీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

విశాఖ కేంద్రంగా చిత్ర పరిశ్రమ ఏర్పాటు చేయాలి

దాబాగార్డెన్స్: విశాఖ కేంద్రంగా చిత్ర పరిశ్రమ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాపా ధనుంజయ్, ఉపాధ్యక్షుడు బైటింటి మీనాక్షిరెడ్డి, దారపు ప్రసాద్‌రెడ్డి, ఏపీ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు తోరం రాజా కోరారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. చిత్ర పరిశ్రమలో నటీనటులు, సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ఏపీ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ పనిచేస్తోందన్నారు. అసోసియేషన్ సభ్యులందరికీ పని కల్పించాలని, పనికి తగిన వేతనం ఇవ్వాలని, బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలని, సొంత గృహాల సాధన కోసం అసోసియేషన్ కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టాలీవుడ్ పెద్దలు చర్చలు జరిపి చిత్ర పరిశ్రమపై ఆధారపడిన వారిని ఆదుకోవాలన్నారు. అసోసియేషన్ కోశాధికారి శిల్లా సుజాత, గంధం విజయరమణి, నిర్మలభాను, రెడ్డిపల్లి పూజాకుమారి, డి.ప్రసాదరెడ్డి, మత్తి రత్నకుమార్, తలారి సురేష్, కంద గాయత్రి, గొందేశి రమణారెడ్డి, భరత్, మాసవరపు శ్రీనివాస్, ఏలూరు లక్ష్మి, డి.శంకర్ పాల్గొన్నారు.

సద్గురు సాయి పాహిమాం

- అత్యంత ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు
- బాబాకు భక్తుల విశేష పూజలు



ఉమా నీలకంఠేశ్వరాలయంలో షిర్డీసాయికి అన్నాభిషేకం చేస్తున్న ఈవో శేఖర్‌బాబు, భక్తులు



రైల్వే న్యూకాలనీ ధ్యాన మందిరంలో సాయిబాబాకు క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: నియోజకవర్గంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షిర్డీసాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు, ప్రజాప్రతినిధులు సద్గురు సాయినాథుడిని మనసారా దర్శించుకుని తరించారు.

300 కిలోల అన్నంతో అభిషేకం

జీవీఎంసీ 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీ సాయిబాబా దేవాలయంలో ప్రధాన అర్చకుడు రాజా స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు సుదర్శన హోమం, 8.30 గంటలకు బాబాకు అభిషేకాలు చేశారు. సాయంత్రం 4 గంటలకు సాయినాథుడిని 300 కిలోల అన్నంతో అభిషేకించారు. దేవదాయ శాఖ అధికారులు సుజాత, శిరీషతోపాటు ఇతర అధికారులు, సిబ్బంది శివ, వనజాక్షి, భక్తులు బాబాను దర్శించుకున్నారు. రాత్రి ఆలయ ఆవరణలో నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది.

భక్తుల స్వహస్తాలతో అన్నాభిషేకం

24వ వార్డు నక్కవానిపాలెం ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో కొలువైన సాయిబాబాకు అర్చకులు రామారావుశర్మ, మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకం, భక్తుల స్వహస్తాలతో 50 కిలోల అన్నంతో అభిషేకం నిర్వహించారు. ఆలయ ఈవో పైలా శేఖర్‌బాబు అన్నాభిషేకంలో పాల్గొన్నారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు బాబాను దర్శించుకుని పూజలు చేశారు. బాబా గుడిలో మరమ్మతులకు సహకరించిన చిన్నబాబు కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ నక్క అప్పలరెడ్డి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణ

సీతంపేట: దొండపర్తి శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో అక్కయ్యపాలెంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు, మంగమ్మ దంపతులు ముఖ్య అతిథులుగా ప్రారంభించి భక్తులకు వడ్డించారు. సుమారు వెయ్యి మంది అన్నప్రసాదం స్వీకరించారు.

ధ్యాన మందిరంలో మహా అన్నదానం

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురుపౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి భక్తుల స్వహస్తాలతో సాయిబాబా విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. మధ్యాహ్నం హారతి సమర్పించిన అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. సుమారు 4 వేల మంది భక్తులు, పేదలు పాల్గొన్నట్లు మందిర కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం సంధ్యాహారతి అనంతరం జరిగిన పల్లకీ సేవ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొని పల్లకీ మోసి తరించారు. శేజ్ హారతి అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఉదయం నుంచి అర్ధ ఏకాహం నిర్వహించారు. భక్తులకు షిర్డీ నుంచి తీసుకొచ్చిన విభూది, పంచముఖి రుద్రాక్షలు, సాయిబాబా ఫొటోలను ఉచితంగా అందజేశారు. ధ్యాన మందిర కమిటీ సభ్యులు, సాయి సేవకులు పూజా కార్యక్రమాల ఏర్పాట్లు పర్యవేక్షించారు.



రైల్వే న్యూకాలనీ ధ్యాన మందిరం వద్ద అభిషేకాల కోసం క్యూలో ఉన్న భక్తులు



అక్కయ్యపాలెంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న సంపంగి శ్రీనివాసరావు దంపతులు



14వ వార్డు ఆలయంలో షిర్డీసాయికి అన్నాభిషేకం

వైభవుడికి పంచామృతాభిషేకం



వైభవ వేంకటేశ్వరుడి ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్జిత సేవా దాతలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో సోమవారం ఆషాడ శుద్ధ పూర్ణిమ వేడుకలు, అర్జిత సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్జిత సేవా దాతలు, భక్తులు మంగళధ్వని, వేదమంత్రోచ్చారణల మధ్య అభిషేక ప్రదక్షిణ చేశారు. అనంతరం శ్రీవారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, ఫలారసాలు, పసుపు, కుంకుమ, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో పంచామృతాభిషేకం జరిపారు. ఉదయం 8.30 గంటలకు వైభవుడి నిజపాద దర్శనం, 10.30కు అలంకార దర్శనం భక్తులకు కల్పించారు. అనంతరం అర్చన చేశారు. ప్రధాన అర్జిత సేవలో పాల్గొన్న దాతలకు స్వామివారి శాలువా, కండువా, వైభవుడి చిత్రపటాన్ని అర్చక స్వామి శేషాచార్యులు అందజేశారు. అనంతరం మంగళాశాసనాలు, తీర్థప్రసాద గోష్టి జరిగింది. కార్యక్రమాన్ని ఆలయ ఈవో బండారు ప్రసాద్ పర్యవేక్షించారు.